www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 28 ఆగస్టు 2023

5

ఏలూరు

అర్హుల ఓట్లు తొలగిస్తే చర్యలు : ఆర్‌డిఒ

జీలుగుమిల్లి: అర్హుల ఓటర్లను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఆదివారం జీలుగుమిల్లిలో జరుగుతున్న ఇంటింటి సర్వేలో ఆర్‌డిఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనర్హుల ఓటర్ల తొలగింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరైన కారణం లేకుండా ఏ ఒక్క ఓటరు పేరునూ తొలగించరాదని సిబ్బందిని ఆదేశించారు. జనన, మరణ రిజిస్టర్ ప్రకారం మరణించిన ఓట్లను తొలగించాలని తెలిపారు. అదే విధంగా బిఎల్‌ఒలు ఓటరు సర్వేకు వెళ్లినప్పుడు అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే వాటిని సరిదిద్ది లోపాలను సరి చూసుకోవాలని సూచించారు. మండలంలో ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును తహశీల్దార్ సుందర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని బిఎల్‌ఒలకు సూచించారు.

ధాన్యం సమస్యలు పరిష్కరించేనా..!

గడిచిన రబీ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు
లారీలు, గోనె సంచుల్లేక అవస్థలు
తేమ, చితుకు(ముక్క), పేరుతో మిల్లర్ల దోపిడీ
ఎదురు డబ్బు చెల్లించలేక రైతులు సతమతం
ప్రతి సీజన్‌లోనూ ఇదే పరిస్థితి
ఈ ఖరీఫ్‌లోనైనా సమస్యలు పరిష్కరించాలని రైతులు వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంట చివరి దశకు చేరుతుందంటే రైతుల్లో ఒక్కటే భయం వెంటాడుతోంది. ఈసారైన ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా ఉంటాయా..? అన్న ఆందోళన రైతులను పట్టిపీడిస్తోంది. 'పండించిన ధాన్యం సవ్యంగా కొనుగోలు చేస్తారా.. లారీలు దొరుకుతాయా.. సంచులు ఇస్తారా' ఇలా అనేక అనుమానాలు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఒక్కటే ప్రతీసీజన్‌లో ధాన్యం అమ్ముకునేందుకు జిల్లా రైతాంగం పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. చేతికొచ్చిన ధాన్యం అమ్ముకోవడం రైతులకు మహాయజ్ఞంలా మారిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరవడం నుంచి లారీలు పంపించకపోవడం, సంచులు అందించకపోవడం, సొమ్ములు సకాలంలో ఖాతాల్లో వేయకపోవడం, తేమ, చితుక(ముక్క) పేరుతో రైతులను నానా ఇబ్బందులు గురిచేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రెండు జిల్లాలోనూ దాదాపు నాలుగులక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుచేశారు. నవంబర్, రెండోవారం నుంచి ఖరీఫ్‌సీజన్ ప్రారంభంకానుంది. దీంతో రైతులను ఇప్పటినుంచే ధాన్యం కొనుగోలు భయం వెంటాడుతోంది. గడిచిన శుక్రవారం ఏలూరు జిల్లాలో వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై చర్చ సాగింది. సంచులు అందుబాటులో ఉంచడంతోపాటు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ జిల్లాకలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిఏటా ఇదేవిధంగా సమావేశాల్లో చర్చిస్తున్నా వాస్తవ పరిస్థితికి వచ్చేసరికి భిన్నంగా ఉంటుంది. మాసూలు చేసి 15 రోజులు గడిచినా లారీలు దొరకడం లేదు. దీంతో రైతులు సొంతంగా లారీలు కట్టించుకోవడంతో పెద్దఎత్తున ఖర్చవుతోంది. తీరా లారీలు రైతులే చూసుకుని ధాన్యం పంపించినా మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. స్థానిక వ్యవసాయాధికారులు తేమశాతం పరిశీలించి అనుమతిస్తున్నా మిల్లర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదు. తేమశాతం ఎక్కువగా ఉందంటూ రైతుల నుంచి డబ్బు కట్టించుకుంటున్నారు. గడిచిన రబీలో ధాన్యం చితుకు అవుతుందంటూ రైతుల నుంచి సొమ్ములు ఎదురు కట్టించుకున్న ఉదంతాలు బహిరంగంగానే సాగాయి. దీంతో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు పడుతున్న ఇబ్బందులు ప్రతిఏటా పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు.

లారీలు, గోనెసంచులు ఏర్పాటులో నిర్లక్ష్యం

ధాన్యం పట్టేందుకు గోనెసంచులు, తరలించేందుకు లారీల ఏర్పాటులో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. అదేమని అడిగితే ఒకేసారి మాసూలు పూర్తవడంతో ఇబ్బందులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాల్లో ఒకేసారి మాసూళ్లు రావడం ఎప్పుడూ జరిగేది. అందుకు తగినట్లుగా ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకేసారి మాసూళ్లు పూర్తవుతాయని ముందుగానే అందరికీ తెలిసిందే. కానీ అందుకు తగిన చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. మిల్లుల కేటాయింపు సైతం దారుణంగా ఉంటుంది. నిడమర్రు మండలంలోని రైతులకు పెదపాడు, నూజివీడు మిల్లులను కేటాయిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేవిషయంపై కొద్దిరోజుల క్రితం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. ధాన్యం సొమ్ము జమలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 21 రోజుల వ్యవధిలో రైతులకు సొమ్ములు జమకావడం లేదు. గడిచిన రబీ సీజన్‌లో కొంత ఫర్వాలేదన్నట్లు పరిస్థితిసాగింది. వచ్చే ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో గతంలో ఏర్పడిన సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం కోరుతోంది.



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ

హామీలిస్తూ.. ముందుకు సాగుతూ..!

చింతలపూడి నియోజవర్గంలో లోకేష్ పాదయాత్రకు ఘనస్వాగతం
దారిపొడవునా జన ప్రవాహం
ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ
విద్యుత్ భారాలు, పెంచిన పన్నులు తగ్గిస్తామని హామీ
మెరుగైన ఇసుక పాలసీ తెస్తామని భరోసా

చింతలపూడిలో ప్రజలతో కరచాలనం చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ముసునూరు/చింతలపూడి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మూడోరోజు ఆదివారం చింతలపూడి నియోజకవర్గంలో ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా లోకేష్ ప్రజాసమస్యలపై హామీలిస్తూ, వినతులు స్వీకరిస్తూ ముందుకుసాగారు. శనివారంరాత్రి ముసునూరు మండలం వలసపల్లిలో బసచేసిన లోకేష్ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వలసపల్లి గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే తమ గ్రామానికి తాగు, సాగునీరు వస్తాయని, మెట్ట భూములు సస్యశ్యామలమవుతాయన్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అసంపూర్తిగా ఉందని, ఎస్‌సి, బిసి, ఒసి ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని, బిసి, ఒసిలకు శ్మశానవాటిక లేదని, అర్హత ఉన్న వితంతువులకు నెలల తరబడి పెన్షన్ రావడం లేదని, డంపింగ్ యార్డ్‌లేదని, తమ్మిలేరుతో గ్రామంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

దర్మాజిగూడెంలో పాదయాత్ర

పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో ప్రాజెక్టులకు గ్రీజు పెట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పంచాయతీ నిధులను దారిమళ్లించి నిర్వీర్యం చేశారన్నారు. తమ్మిలేరుపై సైడ్‌వాల్స్ నిర్మించి ముంపు బెడద తప్పిస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరువంటి మౌలికసదుపాయాలకు పెద్దపీట వేస్తామన్నారు. ముసునూరు మండలం నుంచి చింతలపూడి నియోజకవర్గ సరిహద్దు ప్రాంతం వలసపల్లి అడ్డరోడ్డు వద్ద లోకేష్‌కు జిల్లా, నియోజకవర్గ నాయకులు పెద్దఎత్తున గజమాలలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. రోడ్లను జనంతో కిక్కిరిసిపోయాయి. చింతలపూడి నియోజకవర్గంలోకి పాదయాత్ర చేరుకోగానే ఉమ్మడి కృష్ణా జిల్లానేతలు వీడ్కోలు పలికారు. ధర్మాజీగూడెం శివారులో లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. పార్టీ కేడర్‌కు ఏ కష్టమొచ్చినా వెన్నంటే ఉంటామని, భరోసా ఇచ్చారు. ఇదేస్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో విజయ దుందుభి మోగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ధర్మాజీగూడెంలో లోకేష్ మాట్లాడుతూ కుడిచేత్తో 10 రూపాయల ఇచ్చి, ఎడమచేత్తో రూ.వంద లాగేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేయడం చేతగాని జగన్ అడ్డగోలు పన్నులతో పెట్రోలు, డీజిల్ ధరల్లో మాత్రం ఎపిని దేశంలోనే నెం.1 స్థానంలో నిలిపారన్నారు. జగన్ బాదుడు దెబ్బకు జనం విలవిల్లాడుతున్నారన్నారు. పన్నుల భారాలతో ప్రజల నడ్డివిరుస్తున్న అరాచకపాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలగాలంటే సైకోపోవాలి... సైకిల్ రావాలి అంటూ పిలుపునిచ్చారు.

పాదయాత్రలో ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీమంత్రి పీతల సుజాత, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, నియోజకవర్గ నాయకులు రోషన్‌కుమార్ పలువురు నాయకులు ఉన్నారు.

రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధంగా ప్రభుత్వాల పాలన

జెవివి జిల్లా 17వ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎన్.రమేష్

మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎన్.రమేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వాలు భారత రాజ్యాంగ లక్ష్యాలను పక్కనపెట్టి పాలనా విధానం వారికి ఇష్టం వచ్చినట్టు సాగిస్తున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎన్.రమేష్ అన్నారు. జెవివి జిల్లా 17వ మహాసభ ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జరిగింది. తొలుత జాతీయ జెండాను ప్రముఖ నేత నారాయణరావు, జనవిజ్ఞాన వేదిక పతాకాన్ని ఎస్ఎన్.రమేష్ ఆవిష్కరించారు. జెవివి జిల్లా కార్యదర్శి మోహన్‌రావు అతిథులకు ఆహ్వానం పలికారు. మహాసభకు ఒ.వి.ధనుంజయరావు అధ్యక్షత వహించారు. కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవి.సుధాకర్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎన్.రమేష్ మాట్లాడుతూ జిల్లాలో జనవిజ్ఞాన వేదికను మరింత పటిష్టం చేసుకోవాలని, శాస్త్రీయ దక్పథాన్ని, శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా యువతను జనవిజ్ఞాన వేదికలోకి ఆకర్షించేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. నేడు భావప్రకటన స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగించేలా ప్రభుత్వాల పనితీరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని దాని లక్ష్యాలను పక్కనపెట్టి పాలనా విధానం వారికి ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారన్నారు. గతంలో పోలీస్ కస్టడీ 15 రోజులుంటే మారుతున్న చట్టాల్లో 40 రోజుల నుంచి 60 రోజులకు పెంచారన్నారు. అప్రకటిత ఎమర్జెన్సీ రాజ్యమేలుతుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయన్నారు. ప్రభుత్వరంగ సమస్థలను ప్రయివేటుపరం చేసేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ టెక్నాలజీ అంతా వేదాల్లోనే ఉంది అని చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. పాఠ్య పుస్తకాల్లో అశాస్త్రీయ భావజాలాన్ని చొప్పించడానికి జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యపుస్తకాల నుంచి తొలగించారని అన్నారు.

సమతా కన్వీనర్ తేజశ్రీదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం అత్యంత కిరాతకమైన విషయమన్నారు. అనేక బిల్లులను పార్లమెంటులో ఏ విధమైన చర్చా లేకుండా ఆమోదింపచేసుకుంటున్నా ఈ ప్రభుత్వం మహిళా బిల్లును మాత్రం పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభలో కార్యదర్శి నివేదికపై చర్చలు జరిగాయి. కోశాధికారి నివేదికను ఆమోదించారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో జిల్లా అధ్యక్షునిగా ఒ.వి.ధనంజయరావు, ప్రధాన కార్యదర్శిగా దేవేంద్ర అప్పారావు, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఐవి.సుధాకర్, నారాయణరావు, పాండు, జాయింట్ సెక్రెటరీలుగా కె.రాజేంద్రప్రసాద్, మోహన్‌రావు, శ్రీలక్ష్మి, దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. సమతా కన్వీనర్‌గా వరలక్ష్మి ఎంపికయ్యారు. సాయిరమేష్, గంగాధర్‌రావు, కట్టా సత్యనారాయణ, సుబ్బారాయుడు, ఇస్సాక్ జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

మా భూములు మాకివ్వండి..!

వట్లూరు వెమ్‌టెక్నాలజీ బాధిత రైతుల ఆందోళన
జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన

జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మా భూములు మాకు తిరిగి ఇచ్చేయండి' అంటూ వట్లూరు వెమ్‌టెక్నాలజీ బాధిత రైతులంతా ఏలూరులోని జాతీయ రహదారిపై ఆదివారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో వెమ్‌టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ పరిశ్రమ) ఏర్పాటు కోసం వట్లూరులో రైతులు సాగుచేసుకుంటున్న 350 ఎకరాల భూమిని తీసుకుంది. దీంతో వట్లూరు, భోగాపురంతో పాటు చుట్టుపక్కల దాదాపు 300 సన్నా, చిన్నకార రైతులు భూములు కోల్పోయారు. రైతులకు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇవి చెరువు భూములన్న సాకుతో పరిహారం ఇవ్వకుండా తీరని అన్యాయం చేసింది. అప్పట్లో జిల్లా కలెక్టర్‌ను, ఎంఎల్ఎను ఇలా అనేకమందిని కలిసి తమ బాధ వెళ్లబోసుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. భూములు సేకరించి ఏడేళ్లు దాటిపోయింది. ఏ ఒక్క రైతుకూ ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. సేకరించిన భూముల్లో పరిశ్రమ నిర్మించనూలేదు. పరిశ్రమ నిర్మించకుండా, పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను వంచించింది. ఇప్పటికైనా తమ భూములు తమకు ఇచ్చేస్తే సాగుచేసుకుంటామంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతి లేకుండా జాతీయరహదారిపై ఆందోళన చేయకూడదంటూ ఏలూరు త్రీటౌన్ పోలీసులు రైతులను అక్కడనుంచి పంపేశారు. ఈ కార్యక్రమంలో కారంపూడి ఫౌండేషన్ ఛైర్మన్ కారంపూడి విజయ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రైతులు పిడిగే జోసఫ్, వి.నవీన్, మరీదు గంగాధరరావు, మరీదు శ్రీను, పిడిగే రాయప్పతోపాటు దాదాపు వందమంది రైతులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

15న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల భారీ ధర్నా

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్ చేసిన తమ డబ్బులు తిరిగి చెల్లించాలంటూ వచ్చేనెల 15వ తేదీన విజయవాడలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలోని స్ఫూర్తి భవన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రాజకీయపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యర్రా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాదిమంది చిరువ్యాపారులు, బడుగు జీవులు, దిగువ, మధ్యతరగతి కుటుంబాలు రెక్కలుముక్కలు చేసుకుని సంపాదించిన డబ్బులు భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా అగ్రిగోల్డ్ కంపెనీలో దాచుకున్నారని తెలిపారు. సంస్థ బోర్డు తిప్పేయడంలో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ బాధితులు 230 మంది ఆత్మహత్య చేసుకున్నారని, వీరికి అప్పటి ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించారన్నారు. ఆనాటి ప్రతిపక్ష నాయకులు, ప్రస్తుత సిఎం జగన్ తాను అధికారం చేపట్టిన ఏడు రోజుల్లో బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లయినా బాధితుల సమస్యను పరిష్కరించకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమసమస్యల పరిష్కారం కోసం వీధి పోరాటాలు, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. నాలుగేళ్ల కాలంలో అగ్రిగోల్డ్ బాధితులు 600 మంది ఆత్మహత్య చేసుకున్నారని మరణించిన కుటుంబాలకు రూ.ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగే ధర్నాలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఇప్పటివరకూ అనేకమంది ఏజెంట్లు, డిపాజిట్‌దారులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. బాధితులపై ముఖ్యమంత్రి జగన్ చాలానిర్లక్ష్యంగా ఉంటున్నారని విమర్శించారు. పాలకులు సరైన దిశగా ఆలోచన చేసి బాధితులుగా ఉన్న 19.5 లక్షల మందికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డిపాజిట్ సొమ్ము అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ కంటే తక్కువగా ఉందని, ప్రభుత్వం జోక్యం చేసుకుని అందరికీ న్యాయం చేయాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు నేటి వరకూ 600 మంది మరణించారని, మిగిలిన వారు జీవచ్ఛవాలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య ఎనిమిది రాష్ట్రాలకు సంబంధించిందని, రాష్ట్రంలో వైసిపి, కేంద్రంలో బిజెపి బాధ్యత తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జగన్ కేవలం సంక్షేమ పథకాల బటన్ నొక్కడం కాదని, అగ్రి గోల్డ్ బాధితుల సొమ్ము చెల్లించడానికి కూడా బటన్ నొక్కాలన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ చేస్తున్న పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. అన్ని రాజకీయ పక్షాలు ఏకమై బిజెపిని నిలదీయాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను రాహుల్ గాంధీ దృష్టి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బిజెపి నాయకులు నాగం శివ, జనసేన నాయకులు శ్రావణ్‌కుమార్ గుప్తా, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు సిహెచ్.జగన్మోహనరావు, ఎవి.రాంబాబు, షేక్ మస్తాన్, శివ ప్రసాద్, సూర్యనారాయణ, సత్యనారాయణ, అడ్డగర్ల లక్ష్మి ఇందిర ప్రసంగించారు. తొలుత ఇటీవల మరణించిన అగ్రిగోల్డ్ ఏజెంట్ శివలెంక వెంకటభవానిశారద మృతికి సమావేశం సంతాపం తెలిపింది.

సిపిఎం సమరభేరిని విజయవంతం చేయాలి

ఏలూరులో మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీల భారాలతో ప్రజలను దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30వ తేదీ నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ సిపిఎం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సమరభేరి పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఆదివారం ఉదయం పవర్‌పేట సిపిఎం కార్యాలయంలో ఏలూరు నగర కార్యకర్తల సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం అఖిల భారత కమిటీ దేశవ్యాప్త ఆందోళనలు చేపడుతుందన్నారు. ఈ ఆందోళనలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ప్రజలపై భారాలు వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, వి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, ప్రసాద్, పి.హైమ, జి.రవికిషోర్, గొట్టాపు మురళీ, ఎం.ఇస్సాక్, ఏసుబాబు, కోటేశ్వరరావు, బొత్స సింహాచలం, లక్ష్మీకుమారి, జిల్లా నాయకులు ఆదిశేషు, శారద పాల్గొన్నారు

పెదపాడు : ప్రజలపై ప్రభుత్వాల భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 30వ తేదీ నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ చేపడుతున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో మండల కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 30, 31 తేదీల్లో కరపత్రాలతో ప్రచారం, సంతకాల సేకరణ చేపట్టి వచ్చేనెల ఒకటో తేదీన గ్రామ సచివాలయాల్లో అర్జీలు సమర్పిస్తామని, నాలుగో తేదీన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో పిట్టా రహాయేలు, గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, ముసునూరి కొండలరావు, గోపాలకృష్ణ, జాన్ సాయి, దాసు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భారాలను నిరసిస్తూ ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల నాలుగో తేదీవరకూ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే సమరభేరి కార్యక్రమం పోస్టర్లను మండల కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రాంబాబు, జి.సూర్య కిరణ్, పార్టీ సభ్యులు కె.సుబ్బారావు, నాగరాజు, సునీల్ పాల్గొన్నారు.

సిపిఎం సమరభేరిని జయప్రదం చేయాలని పార్టీ పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నిలయంలో పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల గుప్త సత్యనారాయణ అధ్యక్షతన సిపిఎం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లారి మాణిక్యాలరావు, వంగ గోపి, షేక్ మాబుసుభాని, ఆరేటి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ శతాధిక కవి సమ్మేళనం

ఏలూరు అర్బన్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరులోని వైఎంహెచ్ఎ హాలులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్, ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆవృత్తాల వారీగా నిర్వహించారు. అనంతరం కవితాగానం చేసిన కవులను సత్కరించారు. తొలుత గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పార్కులో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం శ్రీశ్రీ కళా వేదిక ఏలూరు జిల్లా కమిటీ, యూత్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఛైర్మన్లు శ్రీలక్ష్మి, కత్తిమండ ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యం కోసం శ్రీశ్రీ కళావేదిక చేపడుతున్న కార్యక్రమాలకు అత్యంత ఆదరణ లభించడం భాషాభిమానానికి నిదర్శనమని కొనియాడారు. ఈ ర్యాలీలో శ్రీనలంద పాఠశాల విద్యార్థులు కోలాటం ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. తెలుగు తల్లి వేషధారణ, సభ్యుల ప్రముఖ తెలుగు కవుల వేషధారణలు ప్రజాహృదయాలను దోచుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, కళావేదిక జాతీయ నాయకులు చిట్టే లలిత, కట్ల భాగ్యలక్ష్మి, జి.ఈశ్వరీభూషణం, తణుకు రుషి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు శ్రీహరికోటి, పలువురు కవులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తలపెట్టిన 400 రోజులు, 4 వేల కిలోమీటర్ల 'యువగళం పాదయాత్ర' చింతలపూడి నియోజకవర్గంలో చేరుకున్న సందర్భంగా వలసపల్లి అడ్డరోడ్డు నుంచి లింగపాలెం మండలం వరకూ అడుగడుగునా ఫ్లెక్సీలతో నిండిపోయింది. ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాటు చేశారు. దీంతో రోడ్లన్నీ పసుపుమయంతో నిండిపోయాయి. ఆశావాహులు పోటాపోటీగా ఫ్లెక్సీలు వేయించారు. మాజీమంత్రి పీతల సుజాత, బోమ్మాజి అనిల్, సోంగా రోషన్‌కూమర్ యువగళం పాదయాత్ర విజయవంతం చేయటానికి కార్యకర్తలు, నాయకులతో చర్చలు నిర్వహించారు.

కలిదిండి విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

ప్రజాశక్తి - కలిదిండి

ఏడాది పదవ తరగతిలో 583/600 మార్కులు పొందిన కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి ఒ.ఆనంద్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు కరస్పాండెంట్ సానా వెంకట రామారావు తెలిపారు. అత్యధిక మార్కులతో సీటు సాధించిన ఆనంద్‌ను స్కూల్ యాజమాన్యం సన్మానించింది. గ్రామీణ స్థాయి విద్యార్థి ట్రిపుల్ ఐటీ స్థాయి సీటు సాధించడం అభినందనీయమని పడమటిపాలెం సర్పంచి ఎస్.మీనా సరస్వతి అన్నారు. ఆనంద్‌కు పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి

ఫ్రీజర్ వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత సంస్థను బలోపేతం చేయటానికి అందరూ సభ్యులుగా చేరాలని మానవత రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపి పిలుపునిచ్చారు. ఆదివారం యర్రమిల్లిపాడు పంచాయతీ కార్యాలయంలో నెలవారీ సమావేశానికి మండల అధ్యక్షులు గంజి రవికుమార్ అధ్యక్షత వహించగా, సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ యర్రమిల్లిపాడు చుట్టుపక్కల గ్రామాల వారు ఉపయోగించుకునేందుకు ఫ్రీజర్ బహూకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మానవత సీనియర్ నాయకులు శీతాలసత్యనారాయణ, గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, కోనే సత్యనారాయణ, కండెపు రవి, పొనుకుమాట బాబీ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల పనులు పరిశీలిస్తున్న సర్పంచి

సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామని అప్పాపురం సర్పంచి బుర్ల భోగేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని మంచినీటి చెరువులో బ్లీచింగ్ చల్లుతున్న విధానాన్ని, చెరువును నీటితో నింపే విధంగా ఏర్పాటు చేస్తున్న మోటార్ పనులను ఆయన ఆదివారం దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని, తాగునీటి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేలా మంచినీటి చెరువులో పూర్తిస్థాయిలో బ్లీచింగ్ చల్లించామన్నారు. అంతేకాకుండా గ్రామంలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి, చెరువును పూర్తిస్థాయిలో నీటిని నింపుతున్నామని తెలియజేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుని మృతికి సంతాపం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని కృష్ణ యూనివర్సిటీ డాక్టర్ ఎంఆర్ అప్పారావు పిజి సెంటర్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ గణేష్ బాబు(38), డాక్టర్ శివ శంకర్ రెడ్డి(44) హఠాన్మరణం చెందడంతో యూనివర్సిటీ అధ్యాపకులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి బసవేశ్వర రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఆదివారం 'హెల్పింగ్ హాండ్స్' 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్నేహ రైట్స్ అనాథ ఆశ్రమంలోని చిన్నారులు ప్రదర్శించిన నాటకం, నృత్యాలు ఆహుతులను అలరించాయి. 'హెల్పింగ్ హాండ్స్' ద్వారా అందుతున్న సహాయాన్ని స్నేహ రైట్స్ విద్యార్థులు, ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జివిఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్య ప్రదర్శన

నేరాలు - ఘోరాలు

దుకాణాలను ఢీ కొట్టిన లారీ

డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

లారీ అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన ఉన్న రెండు దుకాణాలను ఢీ కొట్టడంతో, దుకాణాల గోడలు ధ్వంసమైన సంఘటన జీలుగుమిల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారుజాము సమయంలో జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం నుంచి అశ్వారావుపేట వైపుకి వెళున్న లారీ, డ్రైవర్ నిద్ర మత్తుతో జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణాలను ఢీ కొట్టడంతో దుకాణల గోడలు ధ్వంసమైయ్యాయి. ఈ ప్రమాదంలో లారీలోని డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణాలలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ముసునూరు

గడ్డి వాము దగ్ధమై శనివారం అర్థరాత్రి పెద్ద ఎత్తున మంటలు రావటంతో గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన తలకొండ సోమయ్యకు చెందిన ట్రాక్టర్ గడ్డి వామును గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీని విలువ సుమారు రూ.9 వేలు వుంటుందని, ఎవరో కోపంతో నోరులేని పశువుల గడ్డిని దగ్ధం చేయటం బాధగా ఉందని సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తులై ఉంటారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా సుమారు రూ.18 వేల విలువచేసే రెండు ట్రాక్టర్ల గడ్డివాము గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని, పోలీసులు వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం..

భయాందోళనలో వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి - మండవల్లి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి అధికారుల అలసత్వం తోడైంది. దీంతో జాతీయ రహదారి గోతులమయమైంది. ఆ గోతుల వెంబడి ప్రయాణించడానికి అటు వాహనదారులు, ఇటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాసుల ముసుగులో జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు కళ్లు మూసుకుపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి నిలువెత్తు నిదర్శనమే మండవల్లి ప్రధాన సెంటర్ వద్ద గోతులమయమైన జాతీయ రహదారి.

గోతులమయంతో జాతీయ రహదారి..

ప్రజలు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారి 165 పామర్రు, దిగమర్రుపై పామర్రు నుంచి ఆకివీడు వరకూ విస్తరింపజేసే విధంగా గుత్తేదారుడు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. అయితే జాతీయ రహదారి విస్తరణలో ఎంతోమంది తమ నివాసాలను, స్థలాలను కోల్పోయారు. నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించడంలో సమస్యలు తలెత్తడంతో పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదు. అయితే పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందిన తర్వాతే పనులు ప్రారంభించి నిర్వహించాలి. కాంట్రాక్టర్ అధికారుల చేతులు తడిపేసి మండవల్లిలో డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టాడు అనే విమర్శలు ఉన్నాయి. ఎవరూ అడగలేరు అనే నిర్లక్ష్యంతో డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టి క్రమ పద్ధతిలో కాకుండా, ఇస్తానుసారంగా ముక్కలు ముక్కలుగా నిర్మించి వదిలేశాడు. దీంతో మురుగుపారేందుకు అవకాశం లేకపోవడంతో మురుగునీరు అంతా జాతీయ రహదారిపైకి చేరుకుంటుంది. మురుగునీరు నిత్యం జాతీయ రహదారిపై ఉండడంతో దుర్వాసనతో పాటు రహదారి పాడై, పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లోకి మురుగునీరు చేరుకోవడంతో గొయ్యి ఎంత లోతులో ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో భారీ వాహనాలు గోతుల్లో పడి పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో సక్రమంగా నిద్రపోలేకపోతున్నామని ప్రజలు వివరిస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు స్పందన కార్యక్రమంలో, గ్రామసభల్లో జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి, పేపర్లో కథనాలు వచ్చాయని, స్పందనలో ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు పెట్టారని, కాంట్రాక్టర్ వద్ద నుంచి భారీ ఎత్తులో ముడుపులు దండుకొని సమస్యను గాలికి వదిలేస్తున్నారని ప్రజలు, వాహనదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గత ఆరు నెలలుగా మండవల్లిలో జాతీయ రహదారి గోతులమయమై వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేదు అంటే కాసులపై వారికున్న మోజును, ప్రజల సమస్యలపై వారికున్న నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది. దీంతో ప్రజల కోసం అధికారులా, కాంట్రాక్టర్ల కోసం అధికారులా అంటూ ప్రజలు, వాహనదారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, జాతీయ రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్పించి, ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులను, ప్రజలను రక్షించాలని వారు కోరుతున్నారు. దీనిపై జాతీయ రహదారుల అభివృద్ధి అధికారి శరత్‌ని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

అవార్డు అందుకుంటున్న సురేష్‌బాబు

సురేష్‌బాబుకు జాతీయ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఈదర గ్రామానికి చెందిన 'మన హక్కులకై పోరాడు - సాధించు' ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్ బాబుకు జాతీయ సేవారత్న అవార్డు లభించింది. గుంటూరులోని ఎసి కాలేజీలో ఆలిండియా ఎన్‌జిఓస్, కెబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేష్‌బాబుకు కెబిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కల్వకుంట బాలరాజు చేతుల మీదుగా అవార్డును అందజేశారు. 'మన హక్కులకై పోరాడు - సాధించు' ఉద్యమ సంస్థ ద్వారా ఆయన చేపట్టిన రక్తదాన శిబిరాలు, లెప్రసీ, కాలనీ ప్రజకు చేసిన సేవలుకు గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా పలువురు సురేష్‌బాబును అభినందించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

మండవల్లి : హెల్మెట్ విధిగా ధరించి, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని చావలిపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలను తనిఖీ చేసి అనంతరం ఆయన వాహనదారులతో మాట్లాడారు. రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు తనపై ఆధారపడి కుటుంబం ఉందని గమనంలో ఉంచుకొని వాహనాలను నడపాలని సూచించారు. చావలిపాడు వద్ద జరిగిన ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడం వల్లే తలకు తీవ్ర గాయమై వాహనదారుడు మృతి చెందాడని తెలిపారు. ముందుగా వెళ్లేవాడిని దాటుకుంటూ, త్వరగా వెళ్లిపోవాలని ఆలోచించకుండా, వెనకాల మెల్లగా వెళదాంలే అన్న ఆలోచన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, సురక్షితంగా ప్రయాణిస్తూ కుటుంబానికి అండగా ఉండాలని ఆయన కోరారు.

నేడు వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ

నూజివీడు రూరల్ : నూజివీడు నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులకు సోమవారం నూజివీడు డివైఇఒ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆదివారం డివైఇఒ ఎం.సేవియా నాయక్ తెలిపారు. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు ఇందులో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తామని తెలియజేశారు.

విద్యార్థుల్లో సత్ప్రవర్తనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థుల్లో దేశభక్తిని, స్నేహభావాన్ని, సమానత్వాన్ని, నీతి నిజాయితీని, సేవాగుణాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్ భాస్కరరావు తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా చేయడం సరైన పద్ధతి కాదని, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం విద్యార్థిపై సహచర విద్యార్థులతో టీచర్ చెంపదెబ్బలు కొట్టించిన సంఘటనపై ఆయన ఆదివారం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని ముజిఫర్ నగర్‌లో ఒక టీచర్ ముస్లింల పట్ల హేయభవాన్ని, చిన్న వయసు నుంచే పిల్లలకు తరగతి గదిలో నూరి పోయడం సరైనది కాదన్నారు. హిందూ విద్యార్థులతో రెండవ తరగతి చదువుతున్న ఏడేళ్ల ముస్లిం బాలుడును దారుణంగా కొట్టించడం ఎంతవరకు సమంజసమైందని ప్రశ్నించారు. పాఠశాలలో టీచర్ ప్రవర్తించిన తీరు జాతి సమానత్వానికి, జాతి విధ్వంసానికి, వినాశనానికి దారి తీసే విధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంచే విధంగా, దేశభక్తిని, సమైక్యతను, నీతి న్యాయం, సేవాగుణం వంటివి పెంపొందించుకునే విధంగా విద్యాబోధన ఉండాలన్నారు. అప్పుడే నవ సమాజ నిర్మాణానికి యువత తన శక్తిని దారపోస్తుందని, యువతను చెడుకు వాడుకుంటే, విధ్వంసానికి, విస్ఫోటనానికి కారణమవుతుందని తెలిపారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో దేశంలో ఎక్కడా జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు టి.నరసాపురానికి 'యువగళం పాదయాత్ర'

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ఈనెల 29న టి.నరసాపురంలోకి ప్రవేశించనుందని, పాదయాత్ర విజయవంతం చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. ఆమేరకు ఆదివారం మండల కేంద్రమైన టి.నరసాపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29, ఉదయం 8 గంటలకు యువగళం పాదయాత్ర మండలంలోకి ప్రవేశించి, టి.నరసాపురం, గురవాయిగూడెం, వేపుగుంట, శ్రీరామవరం, తిరుమలదేవిపేట, మధ్యాహ్నపువారి గూడెం, వెంకటాపురం, బొర్రంపాలెం, వల్లంపట్ల గ్రామాల మీదుగా సాగుతోందన్నారు. మధ్యాహ్నం భోజన విరామం ఎపుకుంటలో ఉంటుందని, రాత్రికి బొర్రంపాలెంలో బస చేస్తారని తెలిపారు. ఈ పాదయాత్రకు పోలవరం నియోజవర్గ ప్రవేశ ద్వారమైన టి.నరసాపురంలో సుమారు పదివేల మందితో, మహిళలతో ఘనంగా స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. లోకేష్ పాదయాత్రకు విశేష స్పందన ప్రజల నుంచి వస్తుందని, ప్రజలు, వివిధ వర్గాల వారి సమస్యలను లోకేష్ నేరుగా వింటారని, అదేవిధంగా వినతులు స్వీకరిస్తారని తెలిపారు. కావున మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామపంచాయతీ నుంచి లోకేష్ బాబు 'యువగళం పాదయాత్రలో' పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరు చలపతిరావు, వాసిరెడ్డి రామ్మోహన్, పోలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, అద్దంకి జగ్గారావు, కాసన్ననేని మాధవరావు, జోనుబోయిన సోంబాబు, సందేపూడి ప్రభాకర్, ఒబిల్లనేని శ్రీనివాస్, పెద్దిన చంద్రశేఖర్, కాసంనేని వెంకట్రావు, రాచబంటు వేములయ్య పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రమామహల్ సెంటర్‌లో కేక్‌ను కట్ చేస్తున్న సిఐటియు నాయకులు

విశ్వమాత, ప్రపంచ మానవతామూర్తి మదర్ థెరిస్సా 113వ జయంతి కార్యక్రమాన్ని మదర్ థెరిస్సా పెయింటర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక రమామహల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అనే స్ఫూర్తితో ఖండాంతరాలు దాటి వచ్చి, భారతదేశంలో నిరుపేదలు, అభాగ్యులు, అనాథలు, కుష్టురోగులకు ఎనలేని సేవలందించిన మదర్ థెరిస్సా జీవనం అందరికీ ఆదర్శప్రాయమైందని అన్నారు. ఆమె స్ఫూర్తితో ప్రతిఒక్కరూ తోటి వారికి సహాయం చేసే అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపకులు అయినపర్తి మాధవరావు, తమ్మినేని నాగరాజు, బి.సోమయ్యలు మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి మదర్ థెరిస్సా పెయింటర్స్ యూనియన్ అధ్యక్షులు శివారెడ్డి, కార్యదర్శి బంగారు బాబు, సహాయ కార్యదర్శి ఫోటోల రాము, శేఖర్, వెంకటేశ్వరరావు, సతీష్ తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు కొనసాగించాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది.

ప్రాణాంతకంగా ప్రధాన రహదారులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ప్రధాన రహదార్లు ప్రాణాంతకరంగా మారాయి. ఈ రహదార్లుల్లో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. రోడ్డు ఎక్కితే తిరిగి ఇంటికి చేరతామో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అత్యంత భయంకరంగా, భారీ గుంతలతో రహదార్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. గతంలో ఎన్నాడు చూడని విధంగా రహదార్లుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రహదార్లు ధ్వంసమైయ్యాయి. ఈ రహదారులపై ప్రయాణించాలంటేనే ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

మురుగునీటిలోంచి స్కూల్స్‌కి వెళుతున్న విద్యార్థులు

ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో రహదార్లుపై ఏర్పడ్డ భారీ గుంతల్లో నీరు చేరి, రహదారి కనబడని పరిస్థితి నెలకొంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఈ రహదారుల్లో రాకపోకలు సాగించాలంటే, ఎక్కడ గుంతల్లో పడి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయోననే భయంతో అల్లాడిపోతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రహదారుల్లో ప్రయాణం సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో చేసేది లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఈ పరిస్థితి మండలంలోని అన్ని ప్రధాన రహదారుల్లోనూ ఉంది.

గురజ రోడ్డులో దిగబడిన వ్యాన్

ప్రమాదకరంగా గురజ రోడ్డు..

ముదినేపల్లి నుంచి గురజ వెళ్లే అర్‌అండ్‌బి రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. ముదినేపల్లిలోని గురజ రోడ్డు సెంటర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకూ రోడ్డు అసాంతం భారీ గుంతలతో దర్శనమిస్తోంది. వర్షాలకు ఈ భారీ గుంతల్లో నీరు చేరడంతో రోడ్డు కనబడక ద్విచక్ర వాహనదారులు అయోమయానికి గురై, తికమక పడుతూ గుంతల్లో పడి క్షతగ్రాతులుగా మారుతున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో, గుంతలు కారణంగా రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేకపోవడంతో, తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు గుంతల్లో ఆటోలు, వ్యాన్లు తరచూ దిగబడిపోవడంతో వాహనచోదకులు తీవ్ర అవస్తలు పడుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ఈ రోడ్డులో వాహనదారులు ప్రమాదాలకు గురౌన్నారు. ఈ రోడ్డులో ద్విచక్రవాహనదారులు పడుతున్న వెతలు వర్ణనాతీతం. ఎప్పుడు ఏ గుంతలో పడి ప్రాణాలు గాలిలో కలిసి పోతాయోననే భయం వాహనదారులను వెంటాడుతోంది. అంత భయనకంగా రోడ్డు పరిస్థితి ఉంది.

విద్యార్థులు అవస్థలు..

గురజ రోడ్డులోని ఎక్కువ విద్యాసంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రయివేటు, ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు, ఐటిఐ, పాలిటెక్నికల్ కళాశాల, తదితర విద్యసంస్థలు ఉన్నాయి. దీంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ రోడ్డుపై నుంచి విద్యాసంస్థలకు రాకపోకలు సాగిస్తుంటారు. అంత ప్రాధాన్యత ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయమై, విద్యార్థుల పాలిట ప్రాణసంకటంగా ఉంది. దీంతో నిత్యం మురుగు నీటిలోనే నడచుకుంటూ విద్యాసంస్థలకు వెళ్తున్నారు. భారీ గుంతలు ఉన్న చోట కర్రలు, ఎర్ర రంగు వస్త్రం గుర్తుగా కడుతున్నారు. విద్యాసంస్థల ముందే రోడ్డు ఆగాథంగా మారడంతో విద్యాసంస్థలకు వెళ్లేందుకు విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు.

రోడ్డుపైనే వర్షపు నీరు..

గుడ్లవల్లేరు రోడ్డులో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో, రోడ్డుపైనే రోజులు తరబడి నిల్వ ఉంటుంది. రోడ్డు వెంబడి ఉన్న డ్రెయిన్, రోడ్డు సమాన ఎత్తులో ఉండడంతో వర్షపునీరు, డ్రెయిన్‌లోని నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో మోకాలు లోతు నీటిలో ప్రజలు రాకపోకలు సాగిస్తూ, ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు స్కూల్ బస్సులతో, విద్యార్థులు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాగే మండలంలోని వడాలి సెంటర్ వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇక్కడ వాహనదారులు పడుతున్న ఇక్కట్లు చెప్పలేనివిగా ఉన్నాయి. వడాలి - తామరకొల్లు రోడ్డు, సింగరాయపాలెం - వడ్లమన్నాడు, ముదినేపల్లి - గుడివాడ, ముదినేపల్లి - కైకలూరు, సింగరాయపాలెం - కోరుకొల్లు ప్రధాన రోడ్లుతో పాటుగా, పల్లెల్లోని జడ్‌పి రోడ్లు, అంతర్గత రోడ్లు అన్నీ గుంతలమయమై రోడ్లపై రాళ్లు పైకి లేచిపోయి, వాహనాలు ప్రయాణించేందుకు ఏమాత్రం అనువుగా లేవు. ఈ రోడ్లపై నిత్యం పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు గర్భిణులు, రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో రెండు కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే, అర్ధగంట సమయం పడుతోందంటే రోడ్లు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్లపై ప్రయాణం చేసే వారికి ఒంటినొప్పులతో పాటు, వాహనాలు సైతం తరచూ మొరాయిస్తూ, మరమ్మత్తులకు లోనౌతున్నాయి. అంత అధ్వాన్నంగా మారి ప్రయాణీకులను భయందోళనలకు గురిచేస్తున్న రహదారులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి, ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని, మండల ప్రజలు, వాహనచోదకులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వడాలి సెంటర్‌లో ఏర్పడ్డ గుంతలు

సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

జగనన్న కాలనీకి విద్యుత్ కాంతులు..

ప్రజాశక్తి - కైకలూరు

జగనన్న కాలనీకి విద్యుత్ సమస్యలు తీరాయని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం జగనన్న గ్రీన్ విలేజ్‌లో నూతన సబ్ స్టేషన్, రూరల్ ఎఇ కార్యాలయాలను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కురేళ్ల బేబి, ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా

అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జంగంగూడెం గ్రామంలో ఎర్ర చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిని స్థానికులు ఆదివారం అడ్డుకున్నారు. చెరువులో మట్టిని తవ్వకుండా జెసిబి, ట్రాక్టర్లను నిలిపివేశారు. స్థానిక నాయకులు అనుమతులు ఉన్నాయని, చెప్పటమే గాని ఆ అనుమతి పత్రాలు ఎవరికీ చూపడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని శిక్షించాలని, వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు కోరారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని శాంతియుత మార్గంలో వారికి సర్ది చెప్పారు. అధికారుల అనుమతి ఉంటేనే మట్టి తవ్వుతారని, అనుమతి లేకుంటే అడ్డగించే పనిని ప్రజలు పెట్టుకోవద్దన్నారు. అటువంటి సమాచారాన్ని అధికారులకు తెలియపరిస్తే వెంటనే చర్యలు చేపడతారని ఎస్ఐ తెలియజేశారు.

సభ్యత్వ కిట్లతో జనసేన కార్యకర్తలు

జనసేన కార్యకర్తలకు ప్రమాద బీమా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జనసేన సభ్యత్వం పొందిన కార్యకర్తలు ప్రమాదాలకు గురైతే రూ.5 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆ కుటుంబాన్నీ ఆదుకొనే విధంగా కార్యకర్తల సంక్షేమానికి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ బీమా సౌకర్యం కల్పించారాని చింతలపూడి నియోజకర్గం జనసేన ఇంఛార్జి మేక ఈశ్వరయ్య తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేట, ఆంజనేయ స్వామి గుడి వద్ద జనసేన సభ్యత్వం పొందిన సభ్యులకు పట్టణ అధ్యక్షులు షేక్ పీరు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చింతలపూడి నియోజకవర్గ ఇంఛార్జి మేకా ఈశ్వరయ్య పాల్గొని సభ్యులకు సభ్యత్వం కిట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో జనసేన సభ్యత్వాలు ఎక్కువ మందికి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగవ వార్డు కౌన్సెలర్ వలవల తాతాజీ పాల్గొన్నారు.

ఘనంగా చేబ్రోలులో కోట్లమ్మ సంబరం

ఉంగుటూరు : చేబ్రోలు గ్రామ దేవత కోట్లమ్మ సంబరాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు దర్శించారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. వినూత్న, విశేష, విచిత్ర వేషాలతో, సాంస్కృతిక ప్రదర్శనతో ఊరేగించారు. శ్రావణమాసం తొలి ఆదివారం కావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ సర్పంచి కర్ణం బుజ్జి ఆధ్వర్యంలో గ్రామస్తులు సహకారంతో సంబరాలను శాంతియుతంగా నిర్వహించారు.

పలు గ్రామాల్లో గంగానమ్మ జాతర

ముదినేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ జాతర వడాలి, గురజ తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పొట్టేళ్లను గ్రామ వీధుల్లో, డప్పు వాయిద్యాలతో ఊరేగించి గంగానమ్మకు మొక్కు తీర్చుకున్నారు. ఈ జాతరలో పెద్దఎత్తున యువకులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు

ఇ.ఎ. 207/2023
ఓ.ఎస్.నెం. 589/2014

శ్రీ కోయి సూర్యచంద్రరావు (డైడ్)
శ్రీ కోయి శ్రీ నాగ వెంకట లక్ష్మి వరప్రసాద్ వగైరా - పిటీషనర్లు / వాదులు

మరియు

ప్రతివాదులు
శ్రీ గూడూరు శ్రావణ్ కుమార్ వగైరా
ప్రపోజ్‌డ్ పార్టీలు
శ్రీమతి గూడూరు రత్నవాణి
శ్రీమతి మత్తి పుష్పలత - రెస్పాండెంట్లు

పై నెంబరు దావాలో వాదులు, ప్రపోజ్‌డ్ పార్టీల దావాలో 3 మరియు 4 ప్రతివాదులుగా చేర్చమని పై నెంబరు పిటీషన్ దాఖలు చేసినారు. సదరు పిటీషనులో ప్రపోజ్‌డ్ పార్టీలకు నోటీసు నిమిత్తం ది.4-9-2023వ తేదీకి వాయిదా అయివున్నది.

కాబట్టి పైన పేర్కొన్న ప్రపోజ్‌డ్ పార్టీలు పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10-30 ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలువుకోవలెను. లేని యెడల వారిని ఎక్సుపార్టీని చేసి పిటీషను తీర్మానించబడును.

ఏలూరు, తేది: 24-08-2023
ఎస్.వి.ఆర్. గాంధీ అడ్వకేట్